

# టేకిట్ ఈజీ!! - 4

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## ఏలియన్ కిడ్నాప్ మేడ్ ఈజీ (పార్ట్ - టూ)

ఆ మెరుపు ఇంట్లోంచొస్తోందా, డెక్ మీంచొస్తోందా అని తలతిప్పకుండా ఐమూలగా చూసాను.

ఆ మెరుపు మెల్లిగా దగ్గరైంది. నాకు సన్నగా వణుకు మొదలైంది. ఇదేదో రేపైనా బావుండేది, కనీసం ఇన్సూరన్నా ఉండేది. ఏందారిరా భగవంతుడా అనుకుని హనుమాన్ చాలీసా చదువుకుందామనుకున్నాను "జై బజరంగ్ బలీ" అనే మాట తప్పిస్తే మరోటి గుర్తురాలేదు. చాలా ప్రయత్నించిన మీదట "ఆరతి కీ జై హనుమాన్ లలాకీ" అన్నాను గెట్టిగా. "అయాం పీపా ద ఏలియన్" అందా గొంతు. "హాయ్ ఐయాం షేప్డ్ లైక్ "పీపా", మైనేం ఈజ్, నేం ఈజ్, పృథ్వీ రాజ్, అన్నాను గొంతు మార్చి.

"నాన్నా, నీపేరు శ్రీనీ కదా" అందా గొంతు. నాకు కిడ్నీలు నోట్లోకొచ్చాయి. ఇదేటిది, ఈ ఏలియన్ నన్ను నాన్నా అంటుంది. నేను కిలాడీనే గాని, మరీ ఇంత అని నాకే తెలీదు. ఏదో అప్పుడప్పుడూ ముచ్చటగా ముచ్చటపడ్డా, అది భూమ్మీదే తప్ప మరో గ్రహానికెళ్ళి స్టెప్పులేసింది లేదు. ఈ రిలేషన్షిప్ ఎలా సాధ్యం ?

పూర్వం ఎప్పుడన్నా దేవ దానవుల యుద్ధంలో ఇంద్రుడి వెస్పాలో కిరసనాయిల్ అయిపోతే, నేనేవన్నా సహాయం చేసానా ? అప్పుడు నన్ను వరం కోరుకోమంటే, ఓ వన్ వీక్ మార్స్ గ్రహానికి ఆల్ ఇంక్లూజివ్ టూర్ టికెట్ అడిగానా ? నేను వెళ్లానా? అప్పటి పంట ఇప్పటికి కోతకొచ్చిందా ? నాకు తెలిసి అటువంటిదేదీ లేదే. మరి ? పోనీ ఇంట్లో కాఫీ పొడి అయిపోతే, మా శాల్తీ నన్ను కొట్టు మీదకి పంపిస్తే, వాడి దగ్గర "పొడి" అయిపోయి, నేను అక్కణ్ణించి అలా నీలగిరి కొండలలోకి వెళ్ళి, అక్కడేవన్నా కాఫీ రాక్షసుడి చెల్లితో "ఛాంగురే బంగారు రాజా", కట్ చేస్తే పిల్లా,తల్లీ,నేనూ మరియు ఫారెక్స్ డబ్బానా? కాదే. మరి ఈ "నాన్నా" అనే అనుబంధం ఎలా ? లేక ఈ ఏలియన్ వాళ్ళ భాషలో "నాన్నా" అంటే "ఓ మహానుభావా" అనా. మనకి అంత లేదు కదా. భూమ్మీదే ఎవడూ సరిగా పేరెట్టి పిలవడు. ఏలియన్స్ ఇంత రెస్పెక్టిచ్చేత్తాయా ? నో నో. మరి ఇదెలా, అనుకుని ఎందుకేనా మంచిదని ఓమాటు తలతిప్పి చూసా.

నా టెన్నీస్ టవల్ కప్పుకుని, లోపల టార్చిలైటెట్టుకుని వచ్చిందా ఏలియన్. ఓసినీ అనుకుని, "ఒసేయ్ ఏలియన్నూ, నేను గుర్రం బొమ్మ కొనుక్కోడానికి బైటికెడుతున్నాను, నువ్వొస్తావా అనడిగాను. గుర్రం బొమ్మా, నాక్కూడా కావాలి" అని ముసుగు తీసేసింది మా చిన్న ఏలియన్ (పెద్ద ఏలియన్ ఎవరు లాంటి ఎదవ డౌట్లడక్కండి, కొంపలంటుకుంటాయి). వెంటనే దాన్ని ఎత్తుకుని, గిర గిరా తిప్పేసాను. నా కళ్ళు తిరిగాయి. అలా తూలుతూ దాన్ని లోపలికి తెచ్చి, సోఫాలో పడేసి, పక్కనే కూలబడ్డాను. కాసేపటికి నిద్దరొచ్చింది, మనక్కాదు, దానికి. దాన్ని పక్కమీదెక్కించి, నేను అలా వెన్నెల్లో వాకింగు చేస్దొద్దామని, రొమాంటిక్ గా ఒక్కణ్ణే బయల్దేరా.

రోజుకి పదివేల అడుగులు నడవాలని పనిలేని డాక్టరొకడు పదే పదే చెప్పటంవల్ల, మనస్తాపం చెంది, సున్నాలకి విలువలేదు కాబట్టి, ఒక అడుగుతో సరిపెడుతున్నా. అంటే పొద్దున్నోటీ, మధ్యానవోటీ, రాత్రోటీని. వామన మూర్తిలాగా మూడు అడుగులు కొలిచేసరికి, ఆ రోజుకి వ్యాయామం చాలు అని నేల తల్లి గోవురూపంలో ప్రత్యక్షమై నన్ను వేడుకుంటుంది. అప్పుడు నేను తల్లి మాట కాదనలేక, నడక ఆపేసి, ఎవర్నైనా లిఫ్ట్ అడిగి ఇంటికొచ్చేస్తాను. అలా కాకుండా రొటీన్ కి భిన్నంగా, కనీసం సబ్ డివిజన్ దాటి పక్క కాలనీదాకా వెళ్ళాలని కఠినమైన నిర్ణయం తీసుకుని, ఆ వెన్నెల రాత్రి, ఆ చీకట్లో (కొంచెం ఆవేశం ఎక్కువైంది, ఈ దిక్కుమాలిన వర్ణనలు మీరు భరించాల్సిందే), ఆ నిశీధిలో, ఆ ఎవ్వరూ లేని ఏకాంతంలో, ఆకాశంలో చందమామా, నేలమీద నేనూ అలా అలా కదులుతూ, మా ఇళ్ళు దాటి, పక్క కాలనీకి దారితీసే ఒక చిన్ని కాలిబాటలో ప్రవేశించాం. అంటే, చంద్రుడు అప్పటికే అక్కడ ఉన్నాడన్నమాట, జస్ట్ క్లారిఫికేషన్ కోసం చెబుతున్నాను.

నాకు ఒంటరి తనం అంటే భయం. ఎందుకంటే భయమయంటే ఒంటరితనమని నా నమ్మకం. (మళ్ళీ నాలో కవి నిద్ర లేస్తున్నాడు, మీ ఖర్మ). "ఒక ఒంటరితనాన్ని మోసిన చంద్రుడు, వెంటాడే నీడల్లో ఇంద్రుడు, నీలంగా ఉండే సముద్రుడు, నా ఇష్ట దైవం రాముడు". అబ్బా, అద్దిరిపోయింది, అందుకే రోజులో కాసేపు మనతో మనం గడపాలంటాను. అయ్యో, ఇప్పుడీ ఆణిముత్యాలని ఇక్కడే పారేస్తే ఎలా ? అనుకుని ఫోను తీసి కసిగా రికార్డు చేద్దామనుకున్నా. ఇంతలో ఆ ఆలోచన విరమించి, ఆ కవిత కి హిందోళంలో ట్యూను కట్టి (నేనే), పాడ్డం మొదలెట్టా. చుట్టు పక్కల చూసా. ఎవరూ లేరు. లేదా, నాకు అలా అనిపించింది. అంతగా భయమేస్తే మా లేడీస్ కి ఫోన్ చేసి స్పీకర్ లో పెడదాం అనుకుంటూ ఇంకాస్త దూరం వెళ్ళా.

పొదల అవతల మైదానంలో చిన్న పొగ పైకిలేచింది, ఒక ఎర్ర బల్బూ, ఒక నీలం బల్బూ వెలిగి ఆరిపోయాయి. నాకు అర్థమైపోయింది. ఏదో జరగబోతోందన్న సంకేతాలు అప్పుడే కనిపిస్తున్నాయి. నేను కాస్త రూటు మార్చి, ఆ పొదల వైపు తిరిగాను. అక్కడ అడవిలాంటి చెట్లు (ఇదో దిక్కుమాలిన వర్ణన). లేదా, చెట్లతో కూడిన అడవి (ఇది రియలైజేషన్). ఆ చెట్ల వెనుక చిన్ని సరస్సు. ఆ సరస్సులో మునిగీ తేలుతున్న కొన్ని వెలుగులు. అవి మునిగినప్పుడు ఆ కొలను నల్లగా, అవి తేలినప్పుడు, పసుపు, ఎరుపు, నీలం, ఇలా బోల్డన్ని ఎల్.ఈ.డీ బల్బు రంగుల్లోనూ మెరిసిపోతోంది. అయితే, ఆ ఒడ్డున ఒక వారగా నీలం బల్బులతో మెరిసే టోపీల్లాంటి గుడ్డలున్నాయి. నేను పది నిముషాలు ప్రయాణించి, చురుకుగా ఆ పది అడుగుల దూరాన్నీ కవర్ చేసాను. ఓ చెట్టు చాటుగా నిలబడ్డాను. లీలగా ఏదో ట్యూన్ వినిపిస్తోంది. ప్రతి నాలుగు నిముషాలకీ రివైండ్ అవుతోంది. ఎక్కడో విన్నట్టుందే అని జాగ్రత్తగా, కుక్కలా చెవులు రిక్కించి విన్నాను. తెలిసిపోయింది.

అది "జలకాలాటలలో" పాటకి రీమిక్సు. జలకాలాటలలో..."ఎట్రుం క్రిం డ్రేబ్ బ్లీప్ బ్లం బ్లం..గల గల పాటలలో..బ్లీం క్లం డ్రుబ్ డ్రబ్ గర్ర్ర్..అంటూ వినిపిస్తోంది. ఆ బీట్ కి తగ్గట్టుగా నీట్లో బల్బులు పైకీ కిందకీ తేలుతున్నాయి. అంటే, అంటే, ఏలియన్ కన్యలు తమ వస్త్రాలను ఏటి ఒడ్డున వదిలి, జలకాలాడుతున్నారన్నమాట. ఇలాంటప్పుడేం చెయ్యాలి. ఏంచెయ్యడవేవిటి, భాగవతం చదువుకున్నాం గదా. జగదేకవీరుని కథ చూసాం కదా.

అంతే, వెంటనే నాకున్న కొద్దిపాటి బుర్రా చురుకుగా పనిచేసింది. నేను అలా నీడలా, మధుబాబు షాడోలా కదిలి, పాకుతూ వెళ్ళి ఓ టోపీ లాక్కొచ్చేసాను. అది మెరవడం మానేసింది. పాట ఆగిపోయింది. అప్పుడు దూరంగా పేద్ద వెలుగు. అక్కణ్ణించి ఏవో పిచ్చి శబ్దాలు

మొదలయ్యాయి. ఒక్క సారి ఎర్ర బల్బులు వెలుగుతూ, ఏదో హంగామా మొదలైంది. వెంటనే ఏలియన్ కన్యలందరూ బైటికొచ్చేసి, తమ టోపీలు పెట్టేసుకుని, ఒక్క జంపులో స్పేష్ షిప్ లోకి జంపు. రెండో సెకనులో స్పేష్ షిప్ పైకి జంపు.

నేను ఫోను తీసి ఎఫ్.బి లైవ్ పెడదామనుకున్నా. కానీ ఫోన్ లో చార్జి లేదు. మా పిల్ల దెయ్యం "కాకుల కోపం" అనబడే ఆట 23 గంటల 23 నిముషాలు ఆడటం వల్ల మా కోలనీలో అందరి ఫోనుల్లోనూ చార్జీ అయిపోయిందని హోం ఓనర్స్ అసోసియేషన్ వాళ్ళు వార్నింగ్ లెటరు పంపించారు. అది గుర్తొచ్చి, కించిత్తు వగచి, మెల్లిగా ఆ టోపీ తీసి నెత్తి మీద పెట్టుకున్నాను. సరిపోలేదు. అది కబ్రాయర్ షేప్ లోఉంది. సరే కదా అని అలాగే తొడిగాను, ఏలియన్ మేన్ లా ఉంటాను కదా అని. తొడగంగానే అది వెలగి, ఆరటం మొదలెట్టింది.

నాకు పై ప్రాణాలు పైనే పోయాయి. కింద ప్రాణాల సంగతి నాకు తెలియదు. సన్నగా వణుకు మొదలైంది. ఇంతలో తలకి కొన్ని ఆకులు కప్పుకుని ఒక జీవి నాముందుకొచ్చి నిలబడింది. బహుశా ఆ ఏలియన్ కన్యక కావచ్చు. అతి కష్టం మీద గొంతు పెగిల్చి "ఈ చెడ్డీ నాకు దొరికింది. నీకివ్వా" అన్నాను. అది కంప్యూటర్ గొంతుతో "చెడ్డీ..చెడ్డీ..." అంది. నాకు ముచ్చటేసింది. వెంటనే ఆ చెడ్డీ తీసి దానికి చూపిస్తూ "యెస్. దిస్ ఈజ్ చెడ్డీ.." అనేసి జేబులో పెట్టేసుకున్నాను. అది చెడ్డీ, చెడ్డీ అని మూడు చేతులతో చప్పట్లు కొడుతోంది. తరువాత నా చొక్కా చూపించి "చొక్కా చొక్కా" అన్నాను. అది నన్ను చూసి "కుక్కా, కుక్కా" అంది. నేను క్లారిఫై చేస్తూ, "నో కుక్కా, సే చొక్కా చొక్కా" అన్నాను. అది "డొక్కా డొక్కా" అంది. "నో నో అయాం డొక్కా, ఇది నా చొక్కా" అన్నాను. అది "చొక్కా చొక్కా" అంది. నాకు ఆనందం ఆగలేదు.

వెంటనే చొక్కా ఇప్పేసాను. లోపల జందెం చూపిస్తూ "దిస్ ఈజ్ జందెం, జందెం" అన్నాను. అది కూడా "జందెం జందెం" అని గెంతులేసింది. మాంచి ఫ్లోలో ఉంది కదా అని దానికి గాయత్రీ మంత్రం కూడ నేర్పించేసాను. అది ఉన్నట్టుండి సైలెంట్ అయిపోయింది. నాకర్థం కాలేదు. ఒక్కసారి అది మంత్రం మొత్తం చదివేసింది. అంతే, రయ్యిమని పేద్ద శబ్దం చేస్తూ, స్పేష్షిప్ వచ్చి వాలింది. లోపల్నించి లేజర్ గన్నులు పట్టుకుని నాలుగు శాల్తీలు దిగాయి. నేను రెండు చేతులూ పైకెత్తి నిల్చున్నాను. ఆ నాలుగు శాల్తీలలో రెండు శాల్తీలు గిలగిలా కొట్టుకుని క్రింద పడిపోయాయి. ఏలియన్ కన్య ముక్కు మూసుకుంటు, పరిగెత్తుకుంటూ వెళ్ళి స్పేస్ షిప్ ఎక్కేసింది. మిగిలిన ఇద్దరు శాల్తీలు లేజర్ గన్నులు పడేసి, ఒక చేత్తో ముక్కు మూసుకుని, మిగిలిన రెండు చేతులతోనూ నన్ను చెరో పక్కా పట్టుకుని, నా చేతులు కిందకి దించేసి, మళ్ళీ పైకి లేపకుండా వెనక్కి కట్టేసారు. ఆనక నా తలమీద ఒకచోట ప్రెస్ చేసారు. నాకేసి చూసారు. నేను మామూలుగానే ఉన్నాను. మళ్ళీ ట్రై చేసారు. బహుశా నా మెదడుని స్విచ్ ఆఫ్ చెయ్యడానికి ట్రై చేసి ఉండచ్చు. నాకు లేదు కాబట్టి పని చేయలేదు. ఒక శాల్తీ " నాన్నా, నాన్నా" అంది. రెండో శాల్తీ, మొదటి శాల్తీతో ఏకీభవిస్తూ "నాన్నా, నాన్నా" అంది. ఇద్దరూ కంప్యూటర్ నవ్వొకటి నవ్వుకుని నా రెక్కలట్టుకుని స్పేస్ షిప్ లోకి లాక్కెళ్ళారు.

ఎంట్రన్సో ఒక సెక్యూరిటీ ఏలియన్ "డొక్కా, బోర్న్ ఆన్.., రేర్ స్పీసీస్, వన్ మేరేజ్, టెన్ ఎఫైర్స్, నాన్నా.." అంది. లోపలి శాల్తీలన్నీ గొల్లుమని నవ్వాయి. పైలట్ ఏలియన్, కోపైలెట్ ఏలియన్ అద్దం దించి, "నాన్నా..నాన్నా" అని పడీ పడీ నవ్వుకున్నాయి. నాకు ఇంతమంది ఫేమిలీ మెంబర్లని చూసేసరికి ధైర్యం వచ్చేసింది. ఇంత ఆప్యాయంగా నాన్నా నాన్నా అంటున్నారంటే, ఇది ఎన్ని జన్మల అనుబంధమో అని సంతృప్తిగా నవ్వుకుని, ఓ మాటు ఆనందబాష్పాలు అలవోకగా చూపుడు వేలు గోటితో తుడుచుకుని, ఇటూ అటూ విదిలించి, వారి వెంట నడిచాను.

నన్ను అలా అలా లోపలి గదులలోకి నడిపించి, ఒక లాబ్ లోకి తీసుకెళ్ళారు. అక్కడ ఒక స్కేనర్లోంచి నన్ను పంపించి, జిరాక్స్ తీసారు. ప్రింటర్ లోంచి తెల్లకాగితం బైటికొచ్చింది. అంటే, నేను తెల్లకాగితమంత స్వచ్ఛమైన వాణ్ణన్నమాట అనుకుని మురిసిపోయాను.

ఇంతలో పచ్చ కోటు తొడుక్కున ఒక ఏలియన్ వచ్చింది. కంప్యూటర్ గొంతులో "హలో డొక్కా గారూ, వెల్కం, నాతో ఇలా రండి" అని ఒక గదిలోకి తీసుకెళ్ళింది. వెళ్ళగానే అమాంతం కొన్ని యంత్రాలు నన్ను తోమి తోమి నాకు స్నానం చేయించేసాయి. మళ్ళీ నాకు నా బట్టలేసి బైటికి తోసేసాయి. నేను బైటికొచ్చి ఆ పచ్చ ఏలియంతో "మేష్టారూ, ఇంతకీ మీది ఏగ్రహవో చెప్పలేదు. త్వరగా నన్ను అక్కడికి తీసుకెళ్ళి టెస్టూ గట్రా చేసి ఏదో తోచిన సంభావన ఇచ్చి మళ్ళీ మాఇంట్లో దించేయండిసార్" అన్నాను. "నోర్ముయ్, మేవేవన్నా సంతోషీ మాత వ్రతం చేసుకుంటున్నావేట్రా, నిన్ను పైకి తీసుకెళ్ళి సంభావన ఇవ్వడానికి. అయినా ప్రతీ అడ్డ గాడిదనీ మా గ్రహానికి తీసుకెళ్ళం. ముందు ఇక్కడే ప్రిలిమినరీ టెస్టులు చేసి, దాంట్లో పాస్ అయినోళ్ళనే పైకి తీసుకెడతాం. నీకు నూటికి మైన్స్ పది మార్కులొచ్చాయి దరిద్రుడా, మా టైం వేస్టయింది. ఇంక నిన్ను మా గ్రహానికెందుకు, టైటేనియం దండగ, టైం దండగ" అందా ఏలియన్ చిరాగ్గా. నాకు అర్థం కాలా.

అంటే నన్ను ఇప్పుడే ఒదిలేస్తారన్నమాట. అయ్యో, వీళ్ళు నాకు స్టాంపు కొట్టకపోతే ఎలా ? రేప్పొద్దున్న ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాకా, క్లెయిం చెయ్యాలి, మిలియన్నో, బిలియన్నో కొట్టాలి. ఎలా ఎలా.. అని ఆలోచించి, చివరికి అడిగా "మేష్టారూ, మరైతే నన్ను కాస్త మా ఇంటి దగ్గర డ్రాప్ చేస్తారా, నిద్దరొస్తోంది" అన్నా. "చేస్తాం. ముందు ఈ స్టాంపు కొట్టి అప్పుడు" అని ఓ స్టాంపు నా పక్కన పెట్టి, మంచినీళ్ళు తెచ్చుకోడానికెళ్ళింది. నేను ఎందుకైనా మంచిదని స్టాంపులో డేట్ మార్చేసి, ఓ వారం ముందు డేట్ పెట్టేసాను, అప్పటికి పాలసీ రెడీ అయిపోతుంది కదా అనే ఎదవాలోచనతో. అది తెలియని ఏలియన్ గాళ్ళు సరిగ్గా నా నడ్డిమీద అచ్చేసి, నన్ను బైటికి దింపేస్తుంటే అడిగాను "ఒరేయ్ ఒక్క విషయం చెప్పరా. ఈళ్ళంతా నన్ను నాన్నా నాన్నా అన్నారు అంటే ఏట్రా" అని. వాడు కంప్యూటర్ వికటాట్టహాసం చేసి, మా భాషలో నాన్నా అంటే "బుర్ర అస్సలులేని అడ్డ గాడిద" అని అర్థం అన్నాడు నన్ను బైటికి తోసేసి. నా రియాక్షన్ షాట్ తీసుకునే లోపు స్పేస్ షిప్ పైకి ఎగిరిపోయింది.

నేను పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చేసి, పక్కెక్కేసాను. మర్నాడు పొద్దున్నే మా శాల్తీని లేపి "ఒసేయ్, త్వరగా నడ్డి ఫొటో తియ్యి, నడ్డి ఫొటో తియ్యి" అన్నాను. "వెళ్ళండి, వెర్రి బాగా ముదిరిపోయింది, పాచి పళ్ళ ఫొటోలు, నడ్డి ఫొటోలూను" అంటూ విసుక్కుంటూ కరాగ్రే వసతే చెప్పుకుంటూ కిందకెళిపోయింది. నేను ఆశ ఛావక, చొక్కా ఇప్పేసి, అద్దంలోకి చూస్తూ, వెనక్కి తిరుగుతూ నానా కష్టాలు పడుతున్నాను, ఆ అచ్చుమీద ఏం ఉందో అని. మొత్తానికి చదవ గలిగాను "నాట్ ఫిట్ ఫర్ అబ్డక్షన్, కీప్ అవే, ప్లీజ్ సబ్స్క్రైబ్ టు క్వాలిటీ కాన్షస్ ఏలియన్స్ డాట్ కాం" అని ఉంది. కింద డేటు కూడా లేదు. మిలియన్లొచ్చే ఛాన్సు పోయిందని గుండె బరువెక్కిపోయింది. బ్రెష్ చేసుకునే మూడ్ లేక అలా రూఫ్ కేసి చూస్తుంటే, వెనకాల నించి వినబడింది "నాన్నా" అని.

"అదిగో, ఆమాటే అనద్దన్నాను" అని ఆవేశంగా పళ్ళు పరపరా తోమడం మొదలెట్టా.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS